సాక్షి
ఆదిలాబాద్
మంగళవారం । 2 । జనవరి । 2024



ట్రిపుల్.. ట్రబుల్స్ తీరేనా?

ఆంక్షల పేరుతో బాసర ట్రిపుల్ ఐటీలోకి ఎవరినీ అనుమతించడం లేదు. కొత్త సీఎం హయాంలో సమస్యలు పరిష్కారం అవుతాయని విద్యార్థులు ఆశిస్తున్నారు. 8లో



ఘనంగా భీమా కోరేగావ్ దివస్

భీమా కోరేగావ్ దివస్‌ను పలు సంఘాల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా సోమవారం ఘనంగా జరుపుకున్నారు. మావలలో తుడుం దెబ్బ ఆధ్వర్యంలో నిర్వహించారు. 9లో

గరిష్ఠం/కనిష్ఠం
30.0/18.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. వేకువజామున పొగమంచు ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

కలెక్టర్‌కు శుభాకాంక్షల వెల్లువ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

కైలాస్‌నగర్: నూతన సంవత్సరం సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి సోమవారం కలెక్టర్ రాహుల్ రాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. క్యాంపు కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు, పూల మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కాగా క్యాంపు కార్యాలయ సిబ్బందితో కలిసి కలెక్టర్ దంపతులు కేక్ కట్ చేశారు. జిల్లా ప్రజలందరికి కలెక్టర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఎస్టీయూ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని జెడ్పీ చైర్మన్‌తో పాటు ఎమ్మెల్యే పాయల్ శంకర్ సోమవారం వేర్వేరుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం సంఘం నాయకులు మాజీ ఎమ్మెల్యే రామన్నను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, అశోక్ కుమార్, బాధ్యులు రవీంద్ర, శీతల్, దిలేష్ చౌహాన్, పొచ్చరెడ్డి, ప్రవీణ్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి 'పొన్నం'కు శుభాకాంక్షలు



మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న సంఘం నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సోమవారం కలిశారు. హైదరాబాద్‌లో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గడ్డం జ్ఞానేశ్వర్, కొండూరు గంగాధర్, దాస్యనాయక్, ఖాదర్‌బిన్ హుస్సేన్, రాజేందర్, ధన్‌రాజ్, లక్ష్మణ్‌రావు, తదితరులున్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ఇచ్చోడ గురుకుల విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న ఆర్సీవో గంగాధర్

ఇచ్చోడ: రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్‌లో ఇచ్చోడ గిరిజన గురుకుల బాలుర విద్యార్థులు సత్తా చాటారు. రెండు రోజుల క్రితం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారంలో నిర్వహించిన 7వ రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాఠశాల, కళాశాల విద్యార్థులు పాల్గొని ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. పదో తరగతి విద్యార్థి శ్రీకాంత్ వంద మీటర్ల పరుగుతో పాటు లాంగ్‌జంప్‌లో స్వర్ణ పతకాలు సాధించి ఇంటర్ సొసైటీ లీగ్‌కు అర్హత సాధించాడు. అలాగే గంగాప్రసాద్, శేఖర్, లోకేశ్, లక్ష్మణ్ ఫుట్‌బాల్‌లో అత్యంత ప్రతిభ కనబరిచారు. ఈ నెల 8న ఉట్నూర్‌లో నిర్వహించనున్న ఇంటర్ సొసైటీ పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా గురుకులాల సమన్వయ కర్త గంగాధర్ సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. ఇందులో ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, వైస్ ప్రిన్సిపాళ్లు హరిరాం, నర్మద, పీడీ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



జైనథ్ మండలం భోరజ్ వద్ద రవాణాశాఖ చెక్‌పోస్టు (ఫైల్)

ఓడీలకు చెక్

- రవాణాశాఖలో 'ఆన్‌డ్యూటీ' రద్దు చేస్తూ ఉత్తర్వులు
- ఇష్టమైన చోట విధుల నిర్వహణకు ఇకపై నో
- పోస్టింగ్ ఉన్నచోట కాకుండా ఆదాయమొచ్చే చెక్‌పోస్టుల్లో డ్యూటీ దందా
- గతేడాది ఈ అంశంలో ఆదిలాబాద్‌లో ఆఫీసర్ల మధ్య వివాదం

సాక్షి,ఆదిలాబాద్: రవాణా శాఖలో ఇకపై ఆఫీసర్లు ఇష్టమైన చోట విధులు నిర్వహించే విషయంలో ప్రభుత్వం నో చెప్పింది. ఎంవీఐలు, ఏఎంవీఐలు, హెడ్ ట్రాన్స్‌పోర్ట్ కానిస్టేబుళ్లు పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఎస్‌సీ), ఇన్‌చార్జి, ఓడీ(ఆన్‌డ్యూటీ)ల పేరిట చెక్‌పోస్టులలో విధులు నిర్వహిస్తూ వస్తుండగా, వాటిని రద్దు చేస్తూ ప్రభుత్వం డిసెంబర్ 29న ఉత్తర్వులు జారీ చేసింది. తక్షణం అమలులోకి తెచ్చింది. చెక్‌పోస్టులలో ఇలా డ్యూటీలు నిర్వహించే అధికారులు, కానిస్టేబుళ్లు ఇకపై తమ రెగ్యులర్ పోస్టు ఉన్నచోటే విధులు నిర్వహించేలా ఈ ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

అక్రమ ఆదాయం కోసం..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో జైనథ్ మండలం భోరజ్ వద్ద సమీకృత చెక్‌పోస్టులో భాగంగా రవాణాశాఖ చెక్‌పోస్టు కొనసాగుంది. అలాగే కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో వాంకిడి, నిర్మల్ జిల్లా భైంసాలో రవాణాశాఖ చెక్‌పోస్టులు ఉన్నాయి. ప్రధానంగా చెక్‌పోస్టుల నుంచి వెళ్లే భారీ వాహనాలకు సంబంధించి పర్మిట్, ఓవర్‌లోడ్, లైసెన్సులు, టాక్స్‌లు, ఇతరత్రా పత్రాలు సరిగ్గా ఉన్నాయా.. లేదా అనేది చెక్‌చేసి పంపాలి. 24 గంటల పాటు చెక్‌పోస్టులకు వచ్చిపోయే వాహనాల తనిఖీతో సందడి ఉంటుంది. ఇతర జిల్లాల్లో రవాణాశాఖ కార్యాలయాల్లో విధులు నిర్వహించే ఆఫీసర్లు ఆదాయం అధికంగా వచ్చే చోట పైరవీలతో ఇలా ఓడీ పేరిట డ్యూటీలు నిర్వహిస్తూ చెక్‌పోస్టులకు రావడం జరుగుతుంది. రెగ్యులర్ పోస్టు ఉన్నచోటు కాకుండా తమకిష్టమైన చోట పనిచేస్తూ మస్తుగా అక్రమ ఆదాయం సమకూర్చుకునేవారు. మంది పెరిగినప్పుడు మజ్జిగ పల్చన అన్నట్టు.. ఇలా చెక్‌పోస్టుపై అధిక ఆఫీసర్లు డ్యూటీకి రావడంతో సహజంగానే వారికి వ్యక్తిగతంగా వచ్చే అక్రమ ఆదాయం తగ్గిపోతుంది. డ్యూటీలు అధికంగా చేస్తే పెద్ద ఎత్తున అక్రమ ఆదాయం సమకూరుతుంది. దీంతోనే ఆఫీసర్ల మధ్య భోరజ్ చెక్‌పోస్టులో డ్యూటీల వివాదం నెలకొంది. ఎట్టకేలకు కొత్త సర్కార్ ఉత్తర్వుల జారీతో సమస్యకు చెల్లుచీటి అయ్యింది.



ఓడీలను రద్దు చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వు ప్రతి

చెక్‌పోస్టులో డ్యూటీల వివాదం



గత ఫిబ్రవరిలో భోరజ్ చెక్‌పోస్టులో వివాదంపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనం

గతేడాది భోరజ్ చెక్‌పోస్టులో వివాదం..

గతేడాది ఫిబ్రవరిలో జైనథ్ మండలం భోరజ్ రవాణాశాఖ సమీకృత చెక్‌పోస్టులో ఆఫీసర్ల మధ్య డ్యూటీ వివాదం రాష్ట్ర వ్యాప్తంగా ఎంత దుమారం లేపిందో తెలిసిన విషయమే. ఈ చెక్‌పోస్టులో ఏడుగురు రెగ్యులర్ అధికారులు ఉండగా, ఆన్‌డ్యూటీ, పూర్తి అదనపు బాధ్యతలు, ఇన్‌చార్జి పేరిట ఇక్కడ ఆ సంఖ్యకు అదనంగా మరో 13 మంది అధికారులు డ్యూటీ నిర్వహిస్తూ వచ్చారు. మొత్తంగా 20 మంది ఆఫీసర్లు డ్యూటీ నిర్వహించే పరిస్థితులు ఉండడంతో.. ఇలా అదనపు బాధ్యతలు నిర్వర్తించే ఓ అధికారి తనకు డ్యూటీలు అధికంగా ఇవ్వాలనే విషయంలో మిగతా ఆఫీసర్లతో వివాదానికి దిగడం అప్పట్లో సంచలనం కలిగించింది. ఈ వివాదంపై అప్పట్లో ఆఫీసర్లు అప్పటి స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్నతో పాటు రాష్ట్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే దానిపై ప్రభుత్వ పరంగా ఎలాంటి చర్యలు లేకపోవడంతో ఈ తంతు అలాగే కొనసాగుతూ వచ్చింది.

నవ్వులు విరిసేనా..?

- 'ఆపరేషన్ స్మైల్' మరూ
- తప్పిపోయిన చిన్నారులు తల్లిదండ్రుల చెంతకు..
- ఈనెల 31 వరకు కార్యక్రమం
- జిల్లాలో మొదలైన తనిఖీలు

2017 నుంచి ఇప్పటి వరకు ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ ద్వారా విముక్తి అయిన చిన్నారుల వివరాలు

సంవత్సరం	ఆపరేషన్ స్మైల్	ఆపరేషన్ ముస్కాన్
2017	144	147
2018	149	163
2019	62	311
2020	--	--
2021	113	72
2022	55	41
2023	110	135

ఆదిలాబాద్‌టౌన్: బాల్యం బంధీ అవుతుంది. చెత్త కుప్పలు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్లలో ఇప్పటికీ వీధిబాలలు దర్శనమిస్తున్నారు. చదువుకోవాలిసిన చిన్నారులు చిత్తు కాగితాలు ఏరడంతో పాటు బట్టీల్లో ఇటుకలు మోస్తున్నారు. పుస్తకాలతో కుస్తీ పడాల్సిన వారు మెకానిక్ షెడ్లలో పానాలతో కాలం వెల్లదీస్తున్నారు. పరిశ్రమలు, హోటళ్లు, లాడ్జీల్లో వెట్టిచాకిరీ చేస్తూ బతుకులు దుర్భరం చేసుకుంటున్నారు. ఇలాంటి వారిని విముక్తి చేసేందుకు ఏటా జనవరిలో ఆపరేషన్ స్మైల్, జూలైలో ఆపరేషన్ ముస్కాన్ వంటి కార్యక్రమాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఈనెల 1 నుంచి 31 వరకు డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ (డీసీపీయూ), కార్మిక, విద్య, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులతో సమన్వయంతో కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. తప్పిపోయిన చిన్నారులను తల్లిదండ్రుల చెంతకు చేర్చించేందుకు చర్యలు చేపడుతున్నారు. అలాగే బాల కార్మికులను విముక్తి చేసేందుకు సిద్ధమవుతున్నారు.

రెండు బృందాలు..

జిల్లాలోని ఆదిలాబాద్, ఉట్నూర్‌లో రెండు బృందాలను ఏర్పాటు చేసి నెల పాటు తనిఖీలు చేపట్టనున్నారు. హోటళ్లు, రైల్వేస్టేషన్, బస్టాండ్, ఇటుకబట్టీలు, మెకానిక్ షెడ్లు తదితర ప్రాంతాల్లో వివిధ పనులు చేపడుతున్న చిన్నారులను గుర్తించి వాటి నుంచి విముక్తి చేయించేలా ముందుకు సాగుతున్నారు. ఈ బృందంలో పది మంది కానిస్టేబుళ్లు ఉన్నారు. అలాగే కార్మిక శాఖ, విద్య, రెవెన్యూ శాఖాధికారులు ఉంటారు. గుర్తించిన చిన్నారులను సీడబ్ల్యూసీ ముందు ప్రవేశపెట్టి యజమానులపై కేసులు నమోదు చేస్తారు. తప్పిపోయిన చిన్నారులను గుర్తించి సొంత గూటికి చేర్పించనున్నారు. గతేడాది ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రలకు చెందిన తప్పిపోయిన దాదాపు ఎనిమిది మంది పిల్లలను వారి తల్లిదండ్రుల చెంతకు చేర్పించారు. ఎఫ్ఐఆర్‌ను క్లోజ్ చేయించారు.



ఫ్యాక్టరీలో తనిఖీలు నిర్వహిస్తున్న బృందం సభ్యులు (ఫైల్)

కానరాని మార్పు..

తప్పిపోయిన చిన్నారులు, వీధిబాలలు పాఠశాలల్లో చేరాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను చేపడుతోంది. ఏటా జనవరి, జూలైలో ఈ కార్యక్రమాలను చేపడుతున్నప్పటికీ ఆశించిన స్థాయిలో మార్పు కానరావడం లేదని పలువురు చర్చించుకుంటున్నారు. దీంతో పూర్తిస్థాయిలో చిన్నారుల మోములో చిరునవ్వులు కనిపించకుండా పోతుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీన్ని పకడ్బందీగా కొనసాగిస్తే పిల్లల భవిష్యత్తుకు బాటలు వేయవచ్చని అభిప్రాయ పడుతున్నారు.

పకడ్బందీగా చేపడతాం..



ఆపరేషన్ స్మైల్–10ను జిల్లాలో పకడ్బందీగా నిర్వహిస్తాం. పిల్లలను పనిలో పెట్టుకుంటే యజమానులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుంది. మైనర్లను పనిలో పెట్టుకున్నట్లు సమాచారం అందిస్తే తనిఖీలు చేపడతాం. ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాల ద్వారా తప్పిపోయిన, బంధి అయిన చిన్నారులకు విముక్తి కలిగిస్తున్నాం.

– రాజేంద్ర ప్రసాద్, ఐసీపీఎస్ అధికారి, ఆదిలాబాద్

గురుకృప దినోత్సవం విజయవంతం చేయండి

నార్నూర్: ఈ నెల 11న నిర్వహించనున్న గురుకృప దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జాతీయ బంజారా దీక్ష భూమి కమిటీ అధ్యక్షుడు జాదవ్ రెడ్డి నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ జాదవ్ శ్రీరామ్ నాయక్ అన్నారు. ఈమేరకు మండలంలోని కొత్తపల్లి–హెచ్ గ్రామంలో దీక్ష భూమి వద్ద ఏర్పాట్లను సోమవారం పరిశీలించారు. అనంతరం దీక్ష గురువు ప్రేంసింగ్ మహారాజ్‌ను కలిశారు. లక్ష మందితో దర్బార్ నిర్వహిస్తామన్నారు. వారి వెంట నాయకులు చౌహాన్ యశ్వంతరావు తదితరులున్నారు.

నూతన ఆలోచనలతో ముందుకు..



కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న ఎస్పీ



ఎస్పీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి
- కలెక్టర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు

ఆదిలాబాద్‌టౌన్: 2024లో నూతన ఆలోచనలు, పకడ్బందీ ప్రణాళికలతో శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు చేపడతామని ఎస్పీ డి.ఉదయ్‌కుమార్ రెడ్డి అన్నారు. న్యూ ఇయర్ వేడుకలను క్యాంపు కార్యాలయంతో పాటు పోలీసు హెడ్ క్వార్టర్స్‌లలో సోమవారం నిర్వహించారు. కేక్ కట్ చేసిన అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిశారు. పూల మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. ఈ ఏడాదిలో మత్తు పదార్థాలను రూపుమాపడం, రోడ్డు ప్రమాదాలు అరికట్టడం, సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యమన్నారు. అనంతరం పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, ఇతర శాఖల ఉన్నతాధికారులు ఎస్పీని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కాగా క్యాంపు కార్యాలయంలో ఆదిలాబాద్, ఉట్నూర్ సబ్ డివిజనల్ పోలీస్ ఉన్నతాధికారులు, సీఐలు, ఎస్సైల సమక్షంలో కేక్ కట్ చేశారు. అలాగే స్థానిక పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో రిజర్వ్ సిబ్బంది సమక్షంలో కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ పార్టీ అనుచరులతో కలిసి ఎస్పీని కలిసి శాలువాతో సత్కరించారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీలు వి.ఉమేందర్, సీహెచ్ నాగేందర్, సీఐలు కె.సత్యనారాయణ, అశోక్, సైదారావు, ప్రేమ్‌కుమార్, నరేష్, భీమేష్, చంద్రశేఖర్, రామకృష్ణ, రవీందర్, సాయినాథ్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు మురళి, నవీన్, స్వామి, సీసీదుర్గం శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై అన్వర్ ఉల్ హక్, రిజర్వ్ సిబ్బంది, ఎస్సైలు, డీసీఆర్‌బీ, ఐటి కోర్, ఫింగర్ ప్రింట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'న్యూ'.. కిక్కు!



- రూ.5.23 కోట్ల మద్యం తాగేశారు..!
- 'నూతన' వేడుకల్లో ఏరులై పారిన మద్యం
- కిటకిటలాడిన వైన్స్‌లు, బార్లు
- గతేడాదితో పోల్చితే పెరిగిన విక్రయాలు

మద్యం విక్రయాల వివరాలు

సంవత్సరం	ఐఎంఎల్	బీర్లు	ఆదాయం (రూ.లక్షల్లో)
2022	6282	3407	రూ.523.38
2023	6417	4165	రూ.535.31

కైలాస్‌నగర్: నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా జిల్లాలో జోష్ కనిపించింది. మద్యం, మాంసం విక్రయాలు జోరుగా సాగాయి. ఈ సారి డిసెంబర్ 31 ఆదివారం రావడంతో ఉదయం నుంచే వైన్స్‌లు, బార్లు, హోటళ్లు, చికెన్, మటన్ షాపులతో పాటు చేపల విక్రయ కేంద్రాల ఎదుట వినియోగదారులు బారులు తీరారు. గడిచిన మూడు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా రూ.5.23కోట్ల మద్యం విక్రయాలు జరిగాయంటే మందుబాబుల చీర్స్ ఏ మేరకు జరిగిందనేది స్పష్టమవుతుంది. గతేడాదితో పోల్చితే మద్యం విక్రయాలు అధికంగా జరిగినట్లు తెలుస్తోంది.

పెరిగిన మాంసం విక్రయాలు

డిసెంబర్ 31 అంటేనే మందు సుక్క.. మటన్, చికెన్ ముక్క ఉండడం సహజం. ఏటా ఈ రోజున మద్యంతో పాటు మాంస విక్రయాలు భారీగా సాగుతాయి. ఈ సారి సండే కలిసిరావడంతో జిల్లాలోని మద్యం దుకాణాలతో పాటు నాన్‌వెజ్ విక్రయ కేంద్రాలన్నీ సందడిగా మారాయి. సాధారణ రోజుల్లో మటన్, చికెన్, చేపల విక్రయాలు సుమారు రూ.50లక్షల వరకు ఉంటాయని, అయితే డిసెంబర్ 31 ఒక్క రోజునే దాదాపు రూ.కోటిన్నర వరకు జరిగి ఉండవచ్చని సంబంధిత శాఖ అధికా రులు చెబుతున్నారు.

ఏరులై పారిన మద్యం

ఈ ఏడాది నూతన సంవత్సర వేడుకల్లో మద్యం ఏరులై పారినట్లుగా తెలుస్తోంది. ఇందుకు జిల్లా అబ్కారీశాఖ గణాంకాలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. జిల్లాలో 40 వైన్స్‌లు, 9 బార్లు ఉన్నాయి. కొత్త ఏడాది రాక పురస్కరించుకుని వీటిలో విక్రయాలు అర్ధరాత్రి 12గంటల వరకు కొనసాగాయి. సాధారణ రోజుల్లో రాత్రి10 గంటలకే మూసి వేయగా మందుబాబుల సౌకర్యార్థం తెరచి ఉంచారు. దీంతో బార్లు, వైన్సులన్నీ ఉదయం నుంచి మూసేంతవరకు కొనుగోలుదారులతో సందడిగా కనిపించాయి. గతేడాదితో పోల్చితే ఈసారి 135 కేసుల ఐఎంఎల్ లిక్కర్, 758కేసుల బీర్లు అధికంగా విక్రయమయ్యాయి. దీంతో అబ్కారీశాఖకు రూ.11.93లక్షల ఆదాయం అధికంగా సమకూరడం గమనార్హం.



ఉత్తమ సేవలకు పతకాలు

- జిల్లాలో 24 మంది పోలీసులకు..
- ఈ నెల 26న ప్రదానం

ఆదిలాబాద్‌టౌన్: ఉత్తమ సేవలు అందించిన జిల్లా పోలీసులకు ప్రభుత్వం సేవ పతకాలు ప్రకటించింది. 2024 నూతన సంవత్సరం సందర్భంగా వెల్లడించింది. 24 మందికి వివిధ పతకాలు లభించాయి. ఇందులో మహోన్నత సేవ పతకం1, ఉత్తమ సేవ పతకం 2, సేవ పతకాలు 21 ఉన్నాయి. వీటిని హోంశాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్ విడుదల చేశారు. వీరికి గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రదానం చేయనున్నారు. కాగా శౌర్య పతకానికి రూ.10వేల నగదు, మహోన్నత సేవ పతకానికి రూ.40వేలు, ఉత్తమ సేవ పతకానికి రూ.30వేలు, కఠిన పతకానికి రూ.20వేలు, సేవ పతకానికి రూ.20వేల చొప్పున నగదుతో పాటు ప్రశంస పత్రాలు అందజేయనున్నారు.

పతకాలు పొందిన వారిలో..

మహోన్నత సేవ పతకం

– ఎస్.ప్రేమ్‌సింగ్, హెడ్‌కానిస్టేబుల్, డీసీఆర్బీ

ఉత్తమ సేవ పతకం.. :

– షేక్ వాజిద్ అలీ, హెడ్‌కానిస్టేబుల్, ఆదిలాబాద్‌రూరల్

– కె.మార్థండి, ఏసీబీ హెడ్‌కానిస్టేబుల్, ఆదిలా బాద్

సేవ పతకాలు..

– మహ్మద్ హరూన్ అలీ, ట్రాఫిక్ ఏఎస్సై, ఆదిలాబాద్
– రాథోడ్ గోపీచంద్, ఏఆర్ ఎస్సై, ఆదిలాబాద్
– షేక్ రసూల్, ఏఆర్ ఎస్సై, ఆదిలాబాద్
– శ్రీగడ వెంకటి, ఏఆర్ఎస్సై, ఆదిలాబాద్
– అబ్దుల్ రవూఫ్, హెడ్‌కానిస్టేబుల్, తాంసి
– గోతి ప్రేమ్‌సింగ్, హెడ్‌కానిస్టేబుల్, ఇచ్చోడ
– కె.భీంరావు, కానిస్టేబుల్, తాంసి
– దారట్ల వెంకటి, కానిస్టేబుల్, తలమడుగు
– జి.ఆశన్న, కానిస్టేబుల్, ఆదిలాబాద్ టూటౌన్
– ఎల్.దినేష్, ఏఆర్ కానిస్టేబుల్, ఆదిలాబాద్
– ఎస్.అరవింద్, ఏఆర్ కానిస్టేబుల్, ఆదిలాబాద్
– జి.ఉదయ్‌కుమార్, ఎస్సై, వన్‌టౌన్
– జి.భూమయ్య, ఏఎస్సై, ఇచ్చోడ
– రాథోడ్ ప్రకాశ్, ట్రాఫిక్ ఏఎస్సై, ఆదిలాబాద్
– మహ్మద్ అబ్దుల్ అజీజ్, ఏఎస్సై, ఉట్నూర్
– రాథోడ్ ధారాసింగ్, ఏఎస్సై, బజార్‌హత్నూర్
– బోరెకర్ ఉత్తం, ట్రాఫిక్ ఎస్సై, ఆదిలాబాద్
– జైస్వాల్ సవిత, ఏఎస్సై, మావల పీఎస్
– ఎల్.దినకర్, ఏఆర్ ఎస్సై, ఆదిలాబాద్
– పసుల సంజీవ్, హెడ్‌కానిస్టేబుల్, ఆదిలాబాద్.

2వ బెటాలియన్‌లో..

ఉత్తమ సేవ పతకం: పొరికల ఉదయ్ సింగ్, రిజర్వు సబ్ ఇన్‌స్పెక్టర్

సేవ పతకం : వెంకటేశం, ఏఆర్ ఎస్సై

క్లుప్తంగా

కార్మికుల హక్కుల సాధనకు కృషి

ఎదులాపురం: కార్మికుల హక్కుల సాధన కోసం కృషి చేస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ అన్నారు. జిల్లాకేంద్రంలోని సీడబ్ల్యూసీ వద్ద సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ కార్మికులు సోమవారం ఏఐటీయూసీలో చేరగా వారికి యూనియన్ కండువాలు కప్పారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జెండాను ఆయన ఆవిష్కరించారు. దేవేందర్, చౌహాన్, సాంబాజి తదితరులు పాల్గొన్నారు.

వందేళ్ల బామ్మ.. బర్త్‌డే



బామ్మ కాళ్లు కడుగుతున్న కుటుంబ సభ్యులు

తాంసి: భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామంలో వందేళ్ల వృద్ధురాలికి కుటుంబ సభ్యులు సోమవారం బర్త్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన అడ న్కర్ రాధాబాయి వయస్సు సెంచరీ పూర్తి చేసుకున్న సందర్భంగా ఆమె కుమారులు ఓంకార్, గంగాధర్, చంద్రకాంత్, కూతురు అనితతో పాటు కుటుంబ సభ్యులు కలిసి సంప్రదాయం ప్రకారం తల్లి పాదాలు కడిగారు. అనంతరం కేక్ కట్ చేశారు.

దాడిచేసిన వ్యక్తులపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: దాడిచేసిన ముగ్గురిపై టూటౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. టూటౌన్ ఎస్సై ప్రదీప్‌కుమార్ కథనం ప్రకారం.. ఆదివారం రాత్రి నూతన సంవత్సర వేడుకల సందర్భంగా పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌కు చెందిన పిల్లలు రోడ్డుపై ఆడుకుంటున్నారు. ఆ సమయంలో అదే కాలనీకి చెందిన సందేశ్, ప్రీతమ్, వికాస్‌లు బైక్‌పై కాలనీలో తిరుగుతూ ఇబ్బందులకు గురిచేశారు. ఈ విషయమై ఫిర్యాదుదారుడు దస్పరే బాబు వారితో మాట్లాడగా ఆ ముగ్గురు ఆయనపై దాడికి దిగారు. ఈ మేరకు ఆయన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

కోటపల్లిలో చిరుత సంచారం



ఆయిల్‌పాం తోటలో చిరుత పాదముద్రలు

కోటపల్లి: మండలకేంద్రానికి అనుకుని ఉన్న ఎంపీపీ సురేఖ ఆయిల్‌పాం తోట సమీపంలో చిరుతపులి సంచారంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. చెన్నూర్ మండలం బుద్ధారం, సంకారం మీదుగా ప్రయాణం చేసి కోటపల్లి నుంచి శంకరాపూర్ మీదుగా వెళ్లి ఉంటుందని అటవీ అధికారులు భావిస్తున్నారు. రైతు రామయ్య సమాచారంతో ఆయిల్‌పాం తోటలో చిరుత పాదముద్రలను గుర్తించారు. అటుగా మామిడి తోటలు, పత్తి చేన్లకు వెళ్లాలంటే రైతులు జంకుతున్నారు.

ట్రిపుల్.. ట్రబుల్స్ తీరేనా?

- సీఎంనే ఆనాడు రానివ్వలేదు
- ప్రధాన గేటు ముందే గవర్నర్ మీడియా సమావేశం
- ఎవరొచ్చినా లోపలకు నో ఎంట్రీ
- ప్రధాన ద్వారం వద్ద ఆంక్షలు
- తల్లిదండ్రులకు మాట్లాడే చాన్స్‌లేదు
- సీఎం రాక కోసం విద్యార్థుల ఎదురుచూపులు



బాసర ట్రిపుల్‌ఐటీ

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీ అంటే రాష్ట్రవ్యాప్తంగా అందరికీ తెలిసిందే.. ఇక్కడ చదివే పిల్లల ఇబ్బందులు, ఆందోళనలు, నిరసనలు ఇలా ఎదో ఒక విషయంలో ట్రిపుల్‌ఐటీ ఎప్పుడు వార్తల్లో నిలిచేది. బాసరలో 2008లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ట్రిపుల్‌ఐటీని ప్రారంభించారు. కొన్నేళ్లుగా ఇక్కడి విద్యార్థులు సమస్యల పరిష్కారానికి ఆందోళనలు చేపట్టారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు లేక సమస్యలు పరిష్కారం కాక ఇప్పటికీ అక్కడ చదివే విద్యార్థులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. బాసర ట్రిపుల్ ఐటీ రహస్య క్యాంపస్‌గా మారింది. మీడియాకు, విద్యార్థి సంఘాలకు, విద్యార్థుల తల్లిదండ్రులకు, మేధావులకు ఎవరైనా సరే లోపలికి అనుమతించడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు చదివే ఈ విశ్వవిద్యాలయంలో ఏమి జరుగుతుందోనని తెలియక పోషకులు ఆందోళనకు గురవుతున్నారు.

మీడియాకు నో ఎంట్రీ

2022 ఆగస్టు 7న బాసర ట్రిపుల్‌ఐటీకి గవర్నర్ హోదాలో తొలిసారి వచ్చిన తమిళిసై పర్యటన కవరేజీకి వెళ్లిన మీడియాను అధికారులు అనుమతించలేదు. ట్రిపుల్‌ఐటీ ప్రధాన ద్వారాన్ని మూసివేసి ఉంచారు. మీడియాతో పాటు ఉదయం వేళ ట్రిపుల్ ఐటీలో పనిచేసే సిబ్బందిని కూడా అనుమతించలేదు. గవర్నర్ బాసర ట్రిపుల్‌ఐటీ నుంచి నిజామాబాద్ తెలంగాణ యూనివర్సిటీకి వెళ్లే సమయంలో ప్రధాన ద్వారం వద్ద మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. అక్కడే మీడియాతో గవర్నర్ తమిళిసై మాట్లాడారు.

ఇప్పటికైనా మారేనా?

నాటి ప్రభుత్వంలో బాసర ట్రిపుల్‌ఐటీలో ఆంక్షల పేరుతో ఎవరిని అనుమతించలేదు. డిసెంబర్ 7న తెలంగాణ సీఎంగా పదవీ ప్రమాణం స్వీకారం చేసిన రేవంత్‌రెడ్డి ప్రగతి భవన్‌ను ప్రజాభవన్‌గా మార్చారు. ప్రజాభవన్‌గా మార్చి అక్కడే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. బాసర ట్రిపుల్ ఐటీలో మాత్రం నేటికి పాత ఆంక్షలే కొనసాగిస్తున్నారు. విద్యార్థులకు సమస్యలు చెప్పుకునే అవకాశం కూడా కల్పించడం లేదు. సీఎం రేవంత్ రెడ్డి నేరుగా బాసర ట్రిపుల్ ఐటీకి వచ్చి సమస్యలు తెలుసుకుని శాశ్వత పరిష్కారానికి మార్గం చూపుతారని ఇక్కడి విద్యార్థులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

తీరిక లేక..

విద్యార్థులకు ప్రతీరోజు క్రీడలు ఆడుకునేలా షెడ్యూల్ ఉంచాలి. ఉదయం నిద్రలేవగానే రాత్రి పడుకునే వరకు స్నానాలు, భోజనాలు, తరగతి గదులు వీటితోనే రోజు పూర్తి అవుతుంది. క్రీడల్లో ఉన్న విద్యార్థులు మానసిక ఒత్తిడికి కాస్త దూరమవుతారు. వారంలో ఒక్కరోజైన చెవులకు ఇంపైనా సంగీతం, వినోద కార్యక్రమాలు తిలకించే ఏర్పాట్లు చేయాలి. అవేవి ఇక్కడ జరగడం లేదు. విద్యార్థుల పరిస్థితిపై ఎప్పటికప్పుడు సైకాలజిస్టులతో కౌన్సెలింగ్‌లు ఇప్పిస్తూ మానసికస్థితిని తెలుసుకోవాలి. ఒంటరిగా ఉండే విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులను పిలిచి గతంలో ఎలా ఉండేవారు. ఇప్పుడు ఎందుకు ఇలా ప్రవర్తిస్తున్నారనే విషయాలను చర్చించాలి. ఇకనైనా విద్యార్థులపై శ్రద్ధ వహించాలని పలువురు కోరుతున్నారు.



2022 ఆగస్టు 7న ట్రిపుల్‌ఐటీ ప్రధాన ద్వారం వద్ద గవర్నర్ మీడియా సమావేశం (ఫైల్)

నేటి సీఎంకు అప్పట్లో నో ఎంట్రీ...



2022 జూన్ 17న అప్పటి పీసీసీ చీఫ్ నేటి సీఎం రేవంత్‌రెడ్డి(ఫైల్)

నేటి సీఎం రేవంత్‌రెడ్డికే అప్పట్లో బాసర ట్రిపుల్‌ఐటీలో అనుమతించ లేదు. విద్యార్థుల సమస్యలు తెలుసుకునేందుకు గోడ దూకివచ్చిన పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. మళ్లీ గేటుద్వారా బయటకు పంపించారు. ప్రస్తుతం ఆయన సీఎంగా కొనసాగుతున్న నేపథ్యంలో ఈ సమస్య పరిష్కారం అవుతుందని విద్యార్థులు భావిస్తున్నారు.

విగ్రహాలకు రక్షణేది?







నిర్మల్‌లోని చైన్‌గేట్ సమీపంలో రాంజీగోండు, కుమురం భీం విగ్రహాలను నూతనంగా ఏర్పాటు చేశారు. కాని అధికారులు రక్షణ చర్యలు తీసుకోలేదు. దీంతో మందుబాబులకు అడ్డాగా మారింది. పట్టపగలే మద్యం తాగుతున్నారు. ప్లాస్టిక్ గ్లాసులు, తినుబండారాలతో పరిసరాలు కంపుకొడుతున్నాయి. వ్యాపారులు సైతం బజ్జీల బండ్లు ఏర్పాటు చేసుకున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

రాకేశ్‌కు అందుతున్న ఆర్థికసాయం

సాక్షి స్పందన

భైంసాటౌన్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న రాకేశ్‌కు దాతల నుంచి ఆర్థికసాయం అందుతోంది. 'ఆపన్నహస్తం అందించరూ..'శీర్షికన 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి పలువురు స్పందిస్తున్నారు. జిల్లా నుంచే కాకుండా ఆదిలాబాద్‌తోపాటు అమెరికా, దుబాయ్ నుంచి సైతం పలువురు తమకు తోచిన ఆర్థికసాయాన్ని ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా అందిస్తున్నారు. రాకేశ్ స్నేహితులు సామాజిక మాధ్యమాల ద్వారా సాయం అందించాలని దాతలను కోరుతున్నారు. ఇప్పటివరకు దాతల నుంచి రూ.4.50 లక్షల ఆర్థికసాయం అందినట్లు తెలిపారు. ఆపరేషన్ కోసం రూ.8 లక్షల వరకు అవసరమని వైద్యులు పేర్కొన్నారని, దాతలు మరింత స్పందించి ఆదుకోవాలని కోరుతున్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న తూమోల్ల దత్తాత్రి

'ఎల్లలు దాటిన మానవత్వం'

జన్నారం: మానవత్వం ఎల్లలు దాటింది. మండలంలోని కలమడుగు గ్రామానికి చెందిన బరుకుంట పోషన్న గత 12 ఏళ్ల క్రితం ఉపాధి నిమిత్తం సౌదీకి వెళ్లాడు. అక్కడ రియాజ్ మహ్మద్ సైఫ్‌కు చెందిన కంపెనీలో కార్మికుడిగా చేరాడు. గత ఆరునెలల క్రితం పోషన్న స్వగ్రామానికి వచ్చాడు. ఈక్రమంలో అనారోగ్యం బారినపడ్డాడు. వైద్యపరీక్షల్లో క్యాన్సర్ అని తేలింది. ఈ విషయం తెలియడంతో రియాజ్ మహ్మద్ సైఫ్ అతని వైద్యఖర్చుల కోసం డబ్బులు పంపించారు. సోమవారం ఆయన కలమడుగుకు వచ్చి పోషన్నను పరామర్శించారు. తర్వాత గ్రామంలోని మసీద్‌లో ప్రార్థనలు చేశారు. మసీద్ మరమ్మతుకు ఆర్థికసాయం అందజేస్తానని తెలిపారు. ముస్లింలకు అనాథ పిల్లలకు రూ.12 వేల నగదు అందించారు. ఈ సందర్భంగా సైఫ్‌ను సాక్షి పలుకరించగా, ఏళ్లుగా ఇంట్లో వ్యక్తిలా పనిచేసిన పోషన్నను పరామర్శించేందుకు ఇక్కడికి వచ్చానని తెలిపారు. మానవత్వం చాటిన సైఫ్‌ను గ్రామస్తులు అభినందించారు.



కలమడుగు గ్రామస్తులతో రియాజ్ మహ్మద్ సైఫ్

కమ్మేసిన పొగమంచు



లక్ష్మణచాంద సమీపంలో..

లోకేశ్వరం మండలంలోని ధర్మోర, పంచగుడి, లోకేశ్వరం, వట్టోలి గ్రామాలు, లక్ష్మణచాంద మండలకేంద్రం, రోడ్డు మార్గాల్లో సోమవారం పొగమంచు కమ్మేసింది. పంట పొలాలు, రోడ్డు మార్గాల్లో దట్టమైన పొగ మంచు వల్ల వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం 8 గంటల వరకు పొగ మంచు తగ్గలేదు.

- లోకేశ్వరం/లక్ష్మణచాంద



లక్ష్మణచాంద: రాచాపూర్-మూటాపూర్ మార్గంలో..



లోకేశ్వరంలో..

కౌన్సిలర్‌ను అరెస్ట్ చేయాలి



ఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: మావల మండల కేంద్రానికి చెందిన దళిత యువకుడు ఎంబడి వంశీ హత్యకు యత్నించిన పాల్పడిన కౌన్సిలర్ ఉష్కం రఘుపతి, ఉష్కం అరుంధతిలను అరెస్టు చేయాలని అంబేద్కర్ సంఘాల ఐక్యపోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని న్యూఅంబేద్కర్ భవనంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. అన్ని దళిత కులాలతో కలిసి ఈనెల 3న కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. 6న ఆదిలాబాద్ పట్టణ బంద్‌కు పిలుపునిస్తామన్నారు. 8న మంత్రులు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్లను కలిసి వినతిపత్రాలు అందిస్తామన్నారు. తాము చేపట్టే కార్యక్రమాలకు పోలీసులు సహకరించాలని కోరుతూ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి కలిసి వినతిపత్రం అందించారు. నిందితులను అరెస్ట్ చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. సమావేశంలో భూమన్న, నవీన్, నగేశ్, ప్రశాంత్, చందాల రాజన్న, దయాకర్, దేవిదాస్, సత్యనారాయణ, సుదర్శన్, శంకర్, చిన్నయ్య, శోబతాయి పాల్గొన్నారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య

భైంసారూరల్: మద్యానికి బానిసై ఒకరు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మండలంలోని సిద్దూర్ గ్రామానికి చెందిన దిగాంబర్ (70) గత కొన్నిరోజులుగా మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో సోమవారం ఇంటి నుంచి వెళ్లి గ్రామసమీపంలోని శివారు ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని భైంసా ఆస్పత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని యాపల్ ప్రాంతంలో జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై చంద్రకుమార్ కథనం ప్రకారం.. బెల్లంపల్లి పట్టణానికి చెందిన కోటేశ్ మందమర్రి ఏరియాలోని కేకే-ఓసీలో క్లర్క్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఎప్పటిలాగా ఉదయం పని నిమిత్తం బైక్ పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో మందమర్రిలోని ఇందిరానగర్‌కు చెందిన మహేశ్ బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఇద్దరికి గాయాలయ్యాయి. వీరిని 108 అంబులెన్స్‌లో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచనలతో కోటేశ్‌ను కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్మీ జవాన్ మృతి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాకేంద్రంలోని రిమ్స్‌లో ఆర్మీ జవాన్ మృతిచెందాడు. టూటౌన్ ఏఎస్సై ముకుంద్ రావు కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని యావత్మాల్ జిల్లా ఝరి తాలుకా పాఠన్‌కు చెందిన ఆర్మీ జవాన్ ముకే రవీంద్ర(35) ఛాతీనొప్పితో బాధపడుతుండగా కుటుంబీకులు రిమ్స్‌కు సోమవారం తీసుకువచ్చారు. పరీక్షించిన వైద్యులు ఆయన అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఇద్దరి మృతికి కారణమైన డ్రైవర్‌పై కేసు

కాసిపేట: డ్రైవర్ అజాగ్రత్తతతో వాహనం నడిపి ఇద్దరి మృతికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగారాం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నస్పూర్‌కు చెందిన రవీందర్ భార్య నిర్మల, కూతురు స్వాతి ఆదివారం రాత్రి సోమగూడెం సమీపంలోని కల్వరి చర్చిలో ప్రార్థనలకు వెళ్లేందుకు రోడ్డు దాటుతున్నారు. మహారాష్ట్రకు చెందిన డ్రైవర్ ఉరాడే భరత్ తన గూడ్స్ క్యారియర్ వాహనాన్ని అజాగ్రత్తగా వేగంగా నడుపుతూ వారిని ఢీకొట్టారు. తీవ్రగాయాలైన వారిని బెల్లంపల్లి ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందారు. భర్త రవీందర్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నరేంద్రాచార్య మహారాజ్‌ను కలిసిన ఎమ్మెల్యే



నరేంద్రాచార్య మహారాజ్‌తో రామారావుపటేల్

భైంసాటౌన్: నానిజ్‌ధామ్ దక్షిణ భారత్ పీఠాధిపతి నరేంద్రాచార్య మహారాజ్‌ను ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్ కలిశారు. జుక్కల్‌లో సోమవారం నిర్వహించిన సమస్య మార్గదర్శన, దర్శన సమారోహ సందర్భంగా ఎమ్మెల్యే ఆయన్ను కలిసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులు పలువురు ఉన్నారు.

నాలుగేళ్ల బాబు కిడ్నీల్లో రాళ్లు

నిర్మల్: వయసుతో సంబంధం లేకుండా కిడ్నీలో రాళ్లు తయారవుతున్నాయి. కేవలం నాలుగేళ్ల చిన్న వయసులోనే ఓ బాబు రెండు కిడ్నీల్లో రాళ్లు కావడంతో నొప్పి భరించలేక కొన్ని రోజులుగా విలవిలలాడిపోయాడు. సోన్ మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన నాలుగేళ్ల బాబు కొంతకాలంగా కిడ్నీలో రాళ్లతో బాధపడుతున్నాడు. తెలిసిన వారి ద్వారా బాబును తీసుకుని తల్లిదండ్రులు జిల్లాకేంద్రంలోని డాక్టర్స్ లైన్‌లో గల స్వప్న హాస్పిటల్‌కు వచ్చారు. జనరల్ సర్జన్ శశికాంత్, కిడ్నీ వైద్యనిపుణుడు శ్రావణ్ బాబు రెండు కిడ్నీల్లో రాళ్లు ఉన్నట్లు గుర్తించి ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం బాబు ఆరోగ్యంగా ఉన్నాడని వారు చెప్పారు. ఇలాంటి కిడ్నీ సంబంధిత వ్యాధులకు, కార్పొరేట్ స్థాయిలో నిర్మల్‌లోనే చికిత్స పొందవచ్చని వైద్యుడు శశికాంత్ చెప్పారు.

ఆదివాసీ పర్ధాన్ సమాజ్ అభివృద్ధికి పాటుపడాలి



నూతనంగా ఎన్నికైన అడహక్ కమిటీ సభ్యులు

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీ పర్ధాన్ సమాజ్ అభివృద్ధికి పాటుపడాలని నాయకులు పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని పిట్టల్‌వాడలో గల ఆదివాసీ భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. విభేదాలు పక్కనపెట్టి అందరూ ఐక్యంగా ఉండాలన్నారు. అందులో భాగంగా మండల, డివిజన్ స్థాయి కమిటీలు నియమించాలన్నారు. ఫిబ్రవరిలో జరిగే హీరాసుక్కా జయంతి విజయవంతానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ఈనెల 7న బేల, జైనథ్, 9న తాంసి, తలమడుగు, 11న ఆదిలాబాద్, గుడిహత్నూర్, 12న భీంపూర్ మండలాల కమిటీలను ఎన్నుకుంటామన్నారు.సమావేశంలో ఆదివాసీ పర్ధాన్ సమాజ్ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, విజయ్, దేవిదాస్, రామాకాంత్, శివకృష్ణ పాల్గొన్నారు.

అడహక్ కమిటీ ఎన్నిక..

ఆదివాసీ పర్ధాన్ సమాజ్ అడహక్ కమిటీని ఎన్నుకున్నారు. సభ్యులుగా పూసం ఆనంద్‌రావ్, కుర్సెంగే తానాజీ, నైతం శుక్లాల్, పూసం ప్రభాకర్, గేడం మాధవ్, సెడ్మకి సుభాష్, గేడం విఠల్, మెస్రం ఈశ్వర్, మడావి దిగంబర్, మెస్రం భాస్కర్, ఆత్రం అనుసూయ, గంగాదేవి ఎన్నికయ్యారు.

అ'పూర్వ' సమ్మేళనం



స్థానిక కుంటాల ఉన్నత పాఠశాలలో 2002-03 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు 21 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. సోమవారం నిర్వహించిన అపూర్వ సమ్మేళనంలో పాల్గొని రోజంతా సంతోషంగా గడిపారు. న్యూఇయర్ వేడుకల సందర్భంగా కేక్ కట్ చేశారు. పాఠశాలలో జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

- కుంటాల

క్లుప్తంగా

నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలి



వంశీని పరామర్శిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: ఎంబడి వంశీపై హత్యాయత్నం చేసిన బీజేపీ నాయకుడు, కౌన్సిలర్ ఉష్కం రఘుపతిని వెంటనే అరెస్ట్ చేయాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్, మాదిగ జాగృతి సంఘం జిల్లా కన్వీనర్ రమేశ్ డిమాండ్ చేశారు. సోమవారం మావల గ్రామంలోని వంశీ కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠినంగా శిక్షించాలన్నారు. దళిత నాయకులు అన్నెల అడెల్లు, బొమ్మెన రవికాంత్, ఎల్మాల నగేశ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజాపాలన గ్రామసభలు

నేరడిగొండ: మండల కేంద్రంతో పాటు కుమారి, తర్నం(కె), సవర్గాం, బుగ్గారం గ్రామాల్లో మంగళవారం ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సంతోష్ రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మణ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఇచ్చోడ: మండలంలో మంగళవారం ఇచ్చోడ, కేశవపట్నం, నవేగావ్, మల్యాల్, కోకస్‌మన్నూర్ గ్రామాల్లో ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాంప్రసాద్ తెలిపారు. గ్రామసభల ద్వారా అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

ఆదిలాబాద్‌రూరల్: గొండ్వానా యువశక్తి.. జై మహంకాళి యూత్ మండల కమిటీని సోమవారం మండలంలోని పందిర్‌లొద్దీ గ్రామంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎర్మ జంగుబాపు, ఉపాధ్యక్షుడిగా ఉయిక తుకారాం, ప్రధాన కార్యదర్శిగా తోడసం భీంరావు, కోశాధికారిగా కుమ్ర మంతు గితచారి, సిడాం సాయికుమార్‌లు ఉన్నారు. యువత అనుకున్న లక్ష్యాల సాధన కోసం కృషి చేయాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.

పరామర్శ

ఆదిలాబాద్‌రూరల్: హత్యాయత్నంలో గాయపడి చికిత్స పొంది ఇంటికి వచ్చిన మావల మండల కేంద్రానికి చెందిన ఎంబడి వంశీని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న సోమవారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు మెట్టు ప్రహ్లాద్, నారాయణ, నల్ల రాజేశ్వర్, సుధీర్, సంతోష్ అజీంఖాన్, మోసిన్, సృజన్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

నేరడిగొండ: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మండలంలో మంగళవారం పర్యటించనున్నట్లు ఎంపీపీ రాథోడ్ సజన్, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం మండల కేంద్రంలోని ప్రజాపాలన గ్రామసభల్లో పాల్గొంటారని తెలిపారు. అనంతరం సవర్గాం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అలాగే పెద్దబుగ్గారం గ్రామానికి మంజూరైన రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

నేరడిగొండ: మండలంలోని కుమారి గ్రామ శివారులోని కొత్త వెళ్లే రోడ్డు మార్గంలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతుండగా పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. కుమారి గ్రామానికి చెందిన ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసి కేసులు నమోదు చేసినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. వారి వద్ద నుంచి రూ.7,240 నగదు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు.

మహనీయుల ఆశయసాధనకు కృషి చేయాలి



నివాళులర్పిస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌రూరల్: మహనీయుల ఆశయసాధనకు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని బుద్ధ విహార్‌లో నిర్వహించిన భీమా కోరేగావ్ శౌర్య దివస్ కార్యక్రమానికి హాజరయ్యారు. 1818లో జరిగిన యుద్ధంలో అమరులైన వీరులకు ఘనంగా నివాళులర్పించారు. అంబేద్కర్, బౌద్ధుడి చిత్రపటాలకు పూల మాలలు వేశారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ.. భీమా కోరేగావ్ యుద్ధంలో అసువులు బాసిన అమరుల త్యాగాలు వెలకట్టలేనివన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గంద్రత్ రమేశ్, దుర్గం శేఖర్, మెట్టు ప్రహ్లాద్, ఆసిఫ్ పాల్గొన్నారు.

మొక్కల పెంపకానికి చర్యలు

- నర్సరీలలో కొనసాగుతున్న బ్యాగ్ ఫిల్లింగ్ పనులు
- జూన్ నాటికి మొక్కలు అందిచడమే లక్ష్యం



తాంసి నర్సరీలో ప్లాస్టిక్ సంచులను బెడ్‌లుగా అమర్చుతున్న కూలీలు

తాంసి: పర్యావరణ పరిరక్షణతో పాటు పచ్చదనానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తూ ప్రతి ఏటా హరితహారం కార్యక్రమాన్ని చేపడుతోంది. ఇందులో భాగంగా మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రతి ఏటా నర్సరీలో మొక్కలను పెంచి వర్షాకాలంలో విరివిగా నాటుతూ సంరక్షిస్తున్నారు. ఇప్పటి నుంచే నర్సరీల్లో మొక్కలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పదో విడత హరితహారం కోసం ఇప్పటి నుంచే ప్రతీ గ్రామ పంచాయతీలో నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కల పెంపకానికి సిద్ధమవుతున్నారు. మొక్కల పెంపకాన్ని వేగవంతం చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. తాంసి మండలంలోని 13 గ్రామ పంచాయతీలో నర్సరీలో నిర్వహణ పనులు వేగవంతంగా చేపడుతున్నారు. హరితహారం కార్యక్రమం నాటికి మొక్కలు ఏదిగే విధంగా పనులను ముమ్మరంగా చేపడుతున్నారు. మండల వ్యాప్తంగా మొత్తం రూ. 1లక్ష 27వేల మొక్కల పెంపకానికి అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు.

ప్రతీ నర్సరీలో 10వేల మొక్కల పెంపకం..

ప్రతి గ్రామపంచాయతీ నర్సరీలో 10 వేల మొక్కలు పెంచే విధంగా నర్సరీలను సిద్ధం చేస్తున్నారు. నర్సరీకి ఇప్పటికే మొక్కలను పెంచేందుకు ప్లాస్టిక్ బ్యాగులను సైతం సరఫరా చేశారు. ఈ బ్యాగుల్లో ఒండ్రు, నల్లమట్టి, ఎర్రమట్టి, పశువుల ఎరువును కలిపి ఫిల్లింగ్ చేస్తున్నారు. ప్లాస్టిక్ బ్యాగుల్లో మట్టిని కూలీల సాయంతో నింపుతున్నారు. టేకు, ఉసిరి, జామ, సీతాఫలంతో పాటు వేప, వెదురు మొక్కలు పెంచేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

ఉపాధి పొందుతున్న కూలీలు..

జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా హరితహారం కార్యక్రమం కోసం నర్సరీలలో చేపడుతున్న మొక్కల పెంపకంతో పలువురు కూలీలు ఉపాధి పొందుతున్నారు. ఒకొక్క నర్సరీలో బ్యాగ్ ఫిల్లింగ్ పనుల కోసం 15 నుంచి 20 మంది కూలీలు పని చేస్తున్నారు. కూలీకి ప్రతిరోజు రూ.265 వరకు ఉపాధి హామీ పథకం కింద డబ్బులు చెల్లిస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు అంతగా లేక పోవడంతో నర్సరీల్లో పని చేస్తూ.. ఉపాధి పొందుతున్నారు.

బ్యాగులో మట్టి నింపుతున్నాం



ప్రస్తుతం నర్సరీలో పని చేస్తున్నాను. గత రెండు రోజులుగా మట్టిని జల్లెడ పట్టే పనులు చేపట్టాం. మట్టిని ప్లాస్టిక్ బ్యాగుల్లో నింపి నర్సరీలో బెడ్‌లుగా అమర్చుతున్నాం. ఈ పనుల ద్వారా ప్రస్తుతం కూలీలకు ఉపాధి దొరుకుతుంది.

– బాలకిష్టు, ఉపాధిహామీ కూలీ, తాంసి

నర్సరీ పనులు ప్రారంభించాం



మండల వ్యాప్తంగా మొక్కల పెంపకానికి 13 పంచాయతీలలో నర్సరీల పనులు ఇప్పటికే ప్రారంభించాం. మొక్కల పెంపకానికి మట్టిని తెప్పించి ప్లాస్టిక్ సంచులలో నింపే పనులు చేపడుతున్నాం. జూన్‌లో మొక్కల అందించాలని లక్ష్యంగా పెట్టుకొని పనులు వేగవంతం చేస్తున్నాం.

– విజయ ఉపాధిహామీ ఏపీవో, తాంసి

కాలేజీ బ్లాక్‌కి రక్షణేది?



పగిలిన కాలేజ్ బ్లాక్ కిటికీ అద్దాలు

జైనథ్: మండల కేంద్రంలోని కేజీబీవీలో రూ. 1.35కోట్లతో నిర్మించిన కాలేజ్ బ్లాక్‌కి రక్షణ కరువైంది. భవనం పూర్తి అయినప్పటికీ, చిన్న చిన్న పనులు పెండింగ్‌లో ఉండడంతో ఇంకా అందుబాటులోకి రాలేదు. ప్రస్తుతం ఈ భవనానికి రక్షణ కరువైంది. ఊరి బయట ఉన్న భవనం ప్రస్తుతం ఆకతాయిలకు అడ్డగా మారింది. కస్తూరిబా పాత పాఠశాల భవనం పక్కనే నిర్మించినప్పటికీ కూడా ప్రహరీ లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. రెండంతస్తులు ఉన్న భవనానికి కనీసం ప్రధాన ద్వారం లేకపోవడంతో తాళం వేసే పరిస్థితి లేదు. దీంతో బయటి వారు ఎవరైనా నేరుగా లోపలికి వెళ్లె అవకాశం ఉంది. ఇప్పటికీ ఈ భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న తరగతి గదుల కిటికీ అద్దాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఆకతాయిలు రాత్రి వేళ ఇక్కడకు వచ్చి కిటికీలు, తలుపులు ధ్వంసం చేస్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. భవనానికి ప్రహరీ, ప్రధాన ద్వారం వెంటనే ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. భవనం అందుబాటులోకి వచ్చినా.. విద్యార్థులు రాత్రివేళ ఉండే పరిస్థితి లేదని, వెంటనే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సత్యశోధక్ సినిమాను ఆదరించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్: మహాత్మా జ్యోతిబా పూలే దంపతుల జీవిత చరిత్ర ఆధారంగా తీసిన సత్యశోధక్ సినిమాను ఆదరించాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో సినిమాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. మరాఠీ భాషలో జనవరి 5న సత్యశోధక్ సినిమా రిలీజ్ అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేటుకులే, సంఘం రాష్ట్ర కోశాధికారి సతీష్, ఉమేష్ రావు డోలే, గంగారం శేండే, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



చిన్నారులతో కేక్‌కట్ చేయిస్తున్న ఎస్సై



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు



కేక్ కట్ చేస్తున్న కంది శ్రీనివాసరెడ్డి

నేరడిగొండ: నూతన సంవత్సర వేడుకలను మండల వ్యాప్తంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కేక్ కట్ చేశారు. నేరడిగొండ పోలీసు స్టేషన్‌లో ఎస్సై సాయన్న చిన్నారులతో కలిసి కేక్ కట్ చేయించారు. అలాగే పలువురు ప్రజాప్రతినిధులు, యువకులు కేక్‌లు కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆలయాల్లో పలువురు ప్రత్యేక పూజలు చేశారు.

ఆదిలాబాద్: ఎమ్మెల్యే పాయల్ శంకర్‌కు జిల్లాలోని ఆదివాసీ పర్ధాన్ సంఘం నాయకులు సోమవారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి శంకర్, పూసం ఆనంద్ రావు, ఉయిక విఠల్, పూసం రమాకాంత్, సిడాం రవి పాల్గొన్నారు.

కంది క్యాంపు కార్యాలయంలో..

కైలాస్‌నగర్: నూతన సంవత్సర వేడుకలను ఆదిలాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి ప్రజాసేవా భవన్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మర్యాద పూర్వకంగా ఆయనను కలిసి నూతన సంవత్సర శుభకాంక్షలు తెలిపారు. శ్రీనివాస రెడ్డి సమక్షంలో కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు.

బీఆర్‌ఎస్ కార్యాలయంలో..

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను జరుపుకున్నారు. నాయకులు, కార్యకర్తలు సోమవారం మాజీ ఎమ్మెల్యే జోగు రామన్నకు పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు.

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని విద్యానగర్ కాలనీలో గల గజిటెడ్ ఉన్నత పాఠశాలలో తైక్వాండో క్రీడాకారులు నూతన సంవత్సర వేడుకలను జరుపుకున్నారు. కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో మాస్టర్ వీరేష్, శిక్షకులు మాధవి, వనిత, అజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన సినీ నటుడు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రానికి చెందిన సినీ నటుడు అభినవ్ సర్దార్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ను జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

అన్నిరంగాల్లో ప్రగతి సాధిద్దాం

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



అనిల్ జాదవ్‌ను సన్మానిస్తున్న నాయకులు

నేరడిగొండ: కొత్త సంవత్సరంలో బోథ్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో ప్రగతిని సాధించేలా కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో బోథ్ నియోజకవర్గ నాయకులు ఆయనను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు. అంతకుముందు శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. అందరు కలిసికట్టుగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేద్దామన్నారు. ఆయా మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌ను కలిసిన నాయకులు

ఇచ్చోడ: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను సోమవారం ఇచ్చోడ బీఆర్‌ఎస్ నాయకుల కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి, ముఖరా(బి) ఎంపీటీసీ గాడ్గేసుభాష్, నవేగావ్ సర్పంచ్ పాండురంగ్, నర్వడే రమేశ్, తృప్తి గంగాధర్, సాబీర్, నిమ్మల కృష్ణరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షల వెల్లువ

బోథ్: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను నేరడిగొండ మండల కేంద్రంలోని ఆయన నివాసంలో బోథ్ మండలానికి చెందిన పలువురు నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బోథ్ సర్పంచ్ సురేందర్, శ్రీధర్ రెడ్డి, ఎలుక రాజు, ప్రవీణ్, నారాయణ రెడ్డి, విజయ్, మహిపాల్, రమేశ్ పాల్గొన్నారు.

ఘనంగా భీమా కోరేగావ్ దివస్



బోథ్: సొనాలలో..



ఇంద్రవెల్లి: నివాళులర్పిస్తున్న ఆత్రం సుగుణ



నార్నూర్: నివాళులర్పిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) మావల మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని మావల మండలం కుమురం భీం కాలనీలో భీమా కోరేగావ్ దివస్‌ను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, ఆదివాసీ మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు గొడం రేణుక, ఉపాధ్యక్షురాలు ఉయిక ఇందిరా, డివిజన్ కమిటీ ఉపాధ్యక్షుడు ఆత్రం గణపతి, కుమ్ర శాంతాబాయి, భుజంగరావు, కుమ్ర భీంరావ్, దుర్వ జగదీరావు, నాగోరావ్, తదితరులు పాల్గొన్నారు.

నేతకానీ మహర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

నేతకానీ మహర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దుర్గం శేఖర్ ఆధ్వర్యంలో శౌర్య దివస్ సందర్భంగా జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా జరుపుకున్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తపూర్‌లోని మహా ప్రజ్ఞ బుద్ధ విహార్ శౌర్య దివస్ వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ఉదయ్ జడే, మాస్కె రాజు, పటాడే రాజు, ప్రజ్ఞ కుమార్, అనిల్ స్వాడే, దయానంద్ కాంబ్లే, రాహుల్, చంద్రకళ బాయి, దైవశాల పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: దళితుల ఆత్మగౌరవ పోరాట విజయమే భీమా కోరేగావ్ అని మానవహక్కుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఆత్రం సుగుణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్, భారతీయ బౌద్ధ మహాసభ, భీం ఆర్మీ ఆధ్వర్యంలో భీమా కోరేగావ్ శౌర్య దివస్ నిర్వహించారు. అంబేద్కర్‌చౌక్‌లో దళిత సంఘాల నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహర్ సైనికుల అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పుష్పలత, ఎంపీటీసీ గిత్తే ఆశాబాయి, మాజీ సర్పంచ్ కోరెంగ సుంకట్‌రావు, సూర్యవంశీ ఉత్తం, వాగ్మార్ కామరాజ్, ముఖడే ఉత్తం, తదితరులు పాల్గొన్నారు.

నార్నూర్: మండల కేంద్రంలోని త్రితర్న బుద్ధ విహార్‌లో భీమా కోరేగావ్ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా జరుపుకున్నారు. పీపీఎస్ అడే సురేశ్, డైరెక్టర్ కాంతరావు దుర్గేలు పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 1818లో మహర్ బెటాలియన్ సైనికులు చేసిన వీరోచిత పోరాటానికి గుర్తుచేస్తూ.. భీమా కోరేగావ్ దివస్ జరుపుకుంటారని అన్నారు. బహుజనులు రాజ్యాధికారం వైపు అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు లోఖండే చంద్రశేఖర్, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు చాల్కుర్ సునీల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు కాంబ్లే బాలాజీ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు లోఖండే దేవురావు, రుక్మాబాయి, నిర్మల పాల్గొన్నారు.

బోథ్: సొనాలలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో భీమా కోరేగావ్ దివస్‌ను సోమవారం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ భవనం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహనికి, కోరేగావ్ స్థూప పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు భగత్ ప్రవీణ్, ఉపాధ్యక్షుడు సంజయ్, రమేశ్, హరీశ్, దినేశ్, లలిత, నర్మద, అమృత్‌రావు పాల్గొన్నారు.

పెట్రోల్‌బంక్ ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని విద్యానగర్ కాలనీలో గల ఓ ప్రైవేట్ పెట్రోల్ బంక్‌ను ఎంపీ సోయం బాపూరావు, ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రారంభించారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, కౌన్సిలర్ కలాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు రూ. 7 కోట్ల,14 లక్షల నిధులతో జరిగిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ పూర్తయిందని, మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సామాజిక తనిఖీపై ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఏపీవో జాదవ్ శ్రీనివాస్ సోమవారం తెలిపారు. మండలంలోని ఉపాధి కూలీలు, అధికారులు సకాలంలో హాజరై ప్రజావేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గడప గడపకూ అయోధ్య అక్షింతలు



అయోధ్య అక్షింతలు తీసుకువస్తున్న భక్తులు



శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

నార్నూర్: గడప గడపకూ అయోధ్య అక్షింతలను అందించాలని సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సేవాలాల్ మహరాజ్ చౌక్ నుంచి గాంధీచౌక్ వరకు భక్తులు శోభాయాత్రగా అక్షింతలను తీసుకువచ్చారు. జనవరి 1 నుంచి 5వరకు ప్రతి గ్రామంలో అయోధ్య శ్రీరామ ప్రాణప్రతిష్ట అక్షింతలు, రాములవారి ఫొటో కరపత్రం వస్తుందన్నారు. కార్యక్రమంలో హిందూ ఉత్సవకమిటీ అధ్యక్షుడు జ్ఞానోబా పుస్కర్, కమిటీ సభ్యుడు గోవింద్, దత్తరాం, చౌహాన్ మహేందర్, చాల్కుర్ ప్రకాష్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని కోలిపురా, విద్యానగర్ కాలనీల్లో సోమవారం అయోధ్య రామ జన్మభూమి అక్షింతల శోభాయాత్ర నిర్వహించారు. అక్షింతల కలశాన్ని కాలనీలో ఊరేగిస్తూ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు, భక్తులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన ఎంపీపీ



కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీపీ

బోథ్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

అయ్యప్ప పల్లకి ఊరేగింపు



పల్లకిని ఊరేగిస్తున్న అయ్యప్పస్వాములు

తాంసి: మండల కేంద్రంలో ఆదివారం ఉదయం అయ్యప్ప స్వామి పల్లకి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. పల్లకిలో అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి, అయ్యప్ప పాటలను ఆలపిస్తూ ఊరేగించారు. మహిళలు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో గురుస్వాములు రాజన్న, పోచ్చారెడ్డి, పొచ్చన్న, నరేష్‌రెడ్డి, గంగారెడ్డి, అరుణ్, సాయి, ప్రశాంత్ పాల్గొన్నారు.

అయ్యప్ప పడిపూజ..

మండల కేంద్రంలో గురుస్వామి పోచ్చన్న ఆధ్వర్యంలో నిర్వహించిన పడిపూజ వైభవంగా సాగింది. సతీష్ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అభిషేకం నిర్వహించారు. పద్దెనిమిది మెట్లపై పడిని వెలిగించారు. కార్యక్రమంలో తాంసి, సుంకిడి, కప్పర్ల గ్రామాలకు చెందిన అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.

బోథ్: సొనాల గ్రామంలోని రామాలయంలో అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. అయ్యప్పస్వాములు ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప నామస్మరణతో రామాలయం మార్మోగింది. అయ్యప్ప పాటలు, భక్తి గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, భక్తులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.